క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

మంగళగిరి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించే జయంతి వేడుకలలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శ్రీ మహంకాళి ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాలు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంతంరాజు కొండూరులోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆషాఢ మాస ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి మాట్లాడుతూ శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం అమ్మవారిని నిమ్మకాయల దండలతో అలంకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్టీ దేవభక్తుని రంగప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో నివాసముంటున్న దివ్యాంగ విద్యార్థుల కుటుంబాలకు మదర్ థెరిస్సా హెల్త్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసరాలను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొగ్గుల పరమేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి మండల భవిత సెంటర్ సహిత విద్య ఉపాధ్యాయులు బి.హరికృష్ణ, వి.సునీత కుమారి సహకారంతో తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్, నులకపేట, అంజిరెడ్డి కాలనీ, మహానాడులో నివసిస్తున్న తీవ్ర వైకల్యం కలిగి మంచానికి పరిమితమైన పది మంది దివ్యాంగ విద్యార్థులకు 25 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశామని, భవిష్యత్‌లో వారికి అయ్యే ఆరోగ్య ఖర్చులను కూడా అందజేస్తామని తెలిపారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



మంగళగిరి: పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చినట్లుగా ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కలకోటి నాగేశ్వరరావు, చందోలు విక్టర్ పాల్, ఇందుపల్లి రామారావు, భాస్కర్, ఏసుప్రభు శ్యామల,ఎం రాజేష్, పులి దాసు, బేతపూడి వెంకయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలందించాలి

ఫిరంగిపురం: వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వేములూరిపాడు గ్రామ శివారులో ఆదివారం హేమంత్ పెట్రోల్ బంకు (ఇండియన్ ఆయిల్ పెట్రోలియమ్స్)ను నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు డి.తిరుమలరావు, కె.కోటేశ్వరరావు, మండవ నరసింహారావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్కూళ్లకు హెచ్ఎం, ఎస్ఏ పోస్టులు మంజూరు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలోని స్వర్ణాంధ్రనగర్, భారత్ పేట, గుజ్జనగుండ్ల, వెంగళరావునగర్, కేవీపీ కాలనీలోని అప్‌గ్రేడ్ అయిన హైస్కూళ్లకు హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయాలని యూటీఎఫ్ గుంటూరు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్నయ్య, కె.ప్రభూజీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షల అనంతరం కళాశాలలకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో సబ్జెక్టు టీచర్లతో పాటు హెచ్ఎం పోస్టులు లేక ఎస్జీటీలతోనే బోధన, పరిపాలన విధులను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఉన్నత పాఠశాలలకు అవసరమైన సబ్జెక్టు టీచర్ పోస్టులను మంజూరు చేయకుండా కేవలం ఎస్జీటీలతోనే నడపడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలలకు అవసరమైన పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఉచిత ఇసుక సరఫరా

- తుళ్లూరు మండలంలో రెండు స్టాక్ పాయింట్లు
- వసతులు పరిశీలించిన వివిధ శాఖల అధికారులు



ఇసుక రేవులో లోడింగ్ పాయింట్ వద్ద వసతులు పరిశీలిస్తున్న అధికారులు

తాడికొండ: తుళ్ళూరు మండలంలోని లింగాయపాలెం, తాళ్లాయపాలెం స్టాక్ పాయింట్‌ల వద్ద నుంచి సోమవారం ఉచిత ఇసుక సరఫరా చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు అధికారులు ఆదివారం రెండు స్టాక్ పాయింట్‌లను పరిశీలించి లోడింగ్‌కు అవసరమైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేడు ఉదయం నుంచి ఉచిత ఇసుక విధానం అమలు జరుగుతుందని, టన్నుకు రూ.260 చొప్పున వాహనాలకు స్టాక్ పాయింట్‌ల వద్దే ఇసుక లోడింగ్ చేస్తారని తెలిపారు. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి రానందున స్టాక్ పాయింట్‌ల వద్దే ఇసుక అమ్మకానికి సంబంధించి ఆఫ్‌లైన్ విధానంలో లోడింగ్ జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని సూచించారు. గత కొన్ని నెలలుగా ఇసుక లేక ఇక్కట్లు పడుతున్న భవన నిర్మాణ యజమానులకు ఇది ఊరట కలిగించే అంశం అయినప్పటికీ నూతన విధానం అమలులో పక్షపాతం లేకుండా అందరికీ అందుతుందా లేక ఇబ్బందులు ఏమైనా ఉంటాయా అనే దానిపై పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో తుళ్లూరు తహసీల్దార్ సుధీర్ బాబు, ఎస్ఈబీ సీఐ ప్రసన్న, ఎస్ఐ గుంజి అంకమ్మ, మైనింగ్ ఆర్ఐ గంగాధర్, రాయపూడి ఇన్‌స్పెక్టర్ గణేష్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటేనే ఇసుక
తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్

కొల్లిపర: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విధానంలో లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డు ద్వారా నమోదు చేసుకుంటేనే స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లోడ్ చేయాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆదేశించారు. రాష్ట్రంలో సోమవారం ఉచిత ఇసుక విధానం ప్రారంభం సందర్భంగా ఆదివారం సబ్ కలెక్టర్ కొల్లిపర, మున్నంగిలోని ఇసుక స్టాక్ పాయింట్‌లను తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు సమన్వయంతో ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఇసుక కావాల్సినవారు బుకింగ్, చెల్లింపులు అంతా ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉంటుందన్నారు. స్టాక్ పాయింట్ వద్ద ఎవరూ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఒక వ్యక్తి ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నులు మాత్రమే ఇసుక ఇవ్వనున్నట్లు తెలిపారు. కొల్లిపర స్టాక్ పాయింట్‌లో 33 వేల టన్నులు, మున్నంగిలో 1. 81 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. స్టాక్ పాయింట్ వద్ద పోలీసులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారుల వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రవీంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు (సాయి), వీఆర్‌వోలు భాస్కర్, భాను, రామారావు, మండల సర్వేయర్ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి రవాణా

- విక్రయించేందుకు ప్రయత్నం
- పక్కా సమాచారంతో పోలీసులు తనిఖీ, దాడి
- ఇద్దరు వ్యక్తులు అరెస్ట్, మరో ముగ్గురు పరారీ
- కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ కల్యాణ్



గంజాయి తరలిస్తు పట్టుబడిన వారిని అరెస్ట్ చూపిస్తున్న సీఐ కళ్యాణ్ తదితరులు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట, ఉండవల్లి రోడ్‌లో నివాసముండే ఓ యువకుడు గంజాయికి అలవాటు పడి గొడవలు చేయడంతో ఆ యువకుడిపై తాడేపల్లి పోలీసులు నిఘా ఏర్పాటు చేసి ఎట్టకేలకు గంజాయి విక్రయించే సమయంలో దాడిచేసి ఆదివారం ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారయ్యారు. తాడేపల్లి సీఐ కళ్యాణ్ తెలిపిన వివరాలు.. నులకపేటలో నివాసముండే ఎస్కే ఖాసిం గంజాయి తాగి గొడవ చేస్తున్నాడని సమాచారం రావడంతో అతడి ప్రవర్తనను ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. నాలుగు రోజుల నుంచి అతను ఈ ప్రాంతంలో లేకపోవడంతో ఎక్కడికి వెళ్లారని విచారణ చేయగా సీలేరు వెళ్లినట్లు సమాచారం వచ్చిందన్నారు. కారులో గంజాయి తీసుకొస్తున్నారని సమాచారం ఉందని, ఖాసింకు గంజాయి సరఫరా చేస్తుంటాడని చెప్పారు. అతడితో పాటు సీలేరు ప్రాంతానికి వెళ్లిన ఎస్కే సుభాని, అప్పు, రెహమాన్, సాయి 4 కేజీల గంజాయిని ప్రసాద్ అనే వ్యక్తి దగ్గర కొనుగోలు చేశారు. తాడేపల్లి కృష్ణాకెనాల్ గేటు వద్ద గంజాయి కలిగిన కారుతో ఆ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం రావడంతో తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ కుమార్, క్రైమ్ కానిస్టేబుల్ కొండలరావు, సురేష్, నాగ ఆంజనేయులు ఘటనా స్థలానికి వెళ్లారని, మొత్తం ఐదుగురు యువకులు ఉండగా ముగ్గురు పరారయ్యారని, ప్రధానంగా గంజాయి తీసుకువస్తున్న ఎస్కే సుభాని, గంజాయి విక్రయిస్తున్న ఎస్కే ఖాసింను అదుపులోకి తీసుకున్నామని, వారు రవాణా చేస్తున్న కారులో రెండు కేజీల గంజాయి లభించిందని మొత్తం నాలుగు కేజీలు కొనుగోలు చేయగా రెండు కేజీలు విజయవాడలో చిన్న పొట్లాలుగా ఏర్పాటు చేసి అమ్మినట్లు అంగీకరించారని చెప్పారు. జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఇద్దరికి అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ కళ్యాణ్ తెలిపారు.

కూటమి హామీలను నెరవేర్చాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు




మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

లక్ష్మీపురం: రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. స్థానిక బ్రాడీపేటలోని మైనేని భవన్‌లో సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభించారు. ప్రారంభ సమావేశానికి ఈమని అప్పారావు అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించి త్వరితగతిన పనులు ప్రారంభించాలని కోరారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లించాలని, కౌలు చెల్లించే కాలపరిమితిని పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాజధాని సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణంలో భూములు సేకరించే రైతులకు ప్యాకేజీని పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వ్యవసాయ సీజన్ న్ ప్రారంభమైందని, కాని ఇంత వరకు కొండవీటి వాగు, గుంటూరు ఛానల్, మేకల వాగు, నల్లమడ వాగు ఇతర పంట కాల్వల్లో తూటుకాడ తీత పనులు పనులు చేపట్టాలని ఆందోళన వ్యక్తం చేశారు. తూటికాడ తొలగించి నీటి పారుదలకు అవకాశం కల్పించాలని కోరారు. ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్.రఘు మాట్లాడుతూ కేంద్రంలో బి.జె.పి. మూడవ సారి అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక ప్రాంతాలలో మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని చెప్పారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన క్రిమినల్ చట్టాలలో మార్పులు చేసి ప్రజా ఉద్యమాలను, ఉద్యమ కారులను అణిచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా జియో రీఛార్జ్ రేట్లు పెంచుకునేందుకు అనుమతి నిచ్చి ప్రజలను దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించాలని, ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు జిల్లా వ్యాపితంగా ఇళ్ల పట్టాలివ్వాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు వై.నేతాజీ, కె.నళినీకాంత్, ఎస్.ఎస్.చెంగయ్య, ఎం.రవి, బూరుగ వెంకటేశ్వర్లు, డి.వెంకటరెడ్డి, ఎల్.అరుణ, బి.కోటేశ్వరి, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జె.వి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ స్వామి రథయాత్ర



రథయాత్రకు హాజరైన భక్తులు



బాలభద్ర సుభద్ర జగన్నాథ స్వామి

నగరంపాలెం: ఒడిశా రాష్ట్రం పూరిలోని జగన్నాథ స్వామి రథయాత్ర పురస్కరించుకుని గుంటూరు కొత్తపేట(పశువుల ఆసుపత్రి ఎదురు)లోని జగన్నాథ స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి బాలభద్ర సుభద్ర జగన్నాథ స్వామి వారి రథయాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో నగర పుర వీధుల్లో రథయాత్ర కొనసాగింది. బారులు తీరిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. జగన్నాథ, ఆంజనేయ, వేంకటేశ్వర స్వామి వార్ల దేవస్థానం సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, గుంటూరు నగరంలోని ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఇస్లావత్ గాంధీనాయక్, దమ్మలపాటి విజయనిర్మల, ఉడత మహేష్‌కుమార్, రాంబాబు, సూరిబోయిన వెంకటరావు, సుజన, వనజ, లక్ష్మి, దేవస్థానం అర్చకులు అయోధ్య అయ్యప్ప, దేవస్థానం సిబ్బంది వేణు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సృజన్‌కుమార్



లక్ష్మీపురం: సీనియర్ సిటిజన్స్ ఆరోగ్య సమస్యలు ఉంటే విధిగా, వైద్యుని సంప్రదిస్తూ వారి సలహా సూచనలు మేరకు జాగ్రత్తలు పాటించాలని జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సృజన్ కుమార్ కోరారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా పెద్ద వయసులవారు ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెద్ద వయసు వారు బరువులెత్తి వ్యాయామం చేయకపోయినా వాకింగ్ ,సైక్లింగ్ లాంటి వ్యాయామాలు చేస్తూ ఉంటే వారి ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. వ్యాయామాలు చేసినప్పుడు తక్కువ బరువు తో వ్యాయామాలు చేయాలని సూచించారు. అనంతరం డాక్టర్ సృజన్ కుమార్ ను ఘనంగా సంస్థ సభ్యులు సత్కరించారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


గుంటూరు ఈస్ట్: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఆదివారం రెడ్డిపాలేనికి చెందిన ఏడుకొండలు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు షాప్ ఎంప్లాయిస్ కాలనీలో దాడిచేసి ఏడుకొండలును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు.

'రఫీ' పాటలతో అభిమానుల పరవశం



తెనాలి: కళావేదికపై మహాగాయకుడు రఫీ ఆలపించిన పాటలు నేటి గాయకుల గళంలోంచి వెలువడి అలల తరగపై పరవళ్లు తొక్కాయి. ఆడిటోరియంలో కిక్కిరిసిన ప్రేక్షకుల హృదయాన్ని పరవశింపజేశాయి. హిందీ సినీ వినీలాకాశంలో తారగా విలసిల్లిన మధురగాయకుడు రఫీ. ఒకప్పుడు ఆయన గొంతులోంచి జాలువారిన మధురమైన పాటలు ఇప్పటికీ పాటల ప్రేమికులను అలరిస్తూనే ఉన్నాయి. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జరిగిన సంగీత కచేరీ ఇందుకో నిదర్శనం. పట్టణ సంగీత సంస్థ 'సంకీర్తన' ఆధ్వర్యంలో 'సుహానీ షామ్', 'రఫీ సాబ్‌కే యాద్‌మే' పేరుతో 7వ వార్షిక సంగీత కచేరీని ఆసాంతం ప్రేక్షకులు ఆస్వాదించారు. రఫీ గానం చేసిన హిందీ, తెలుగు సినిమాల్లోని పాటలను గాయనీగాయకులు ఆలపించారు. సంకీర్తన సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు సభానిర్వహణ చేస్తూనే.. రఫీ పాటలతో కరతాళధ్వనులను అందుకున్నారు. వీరితోపాటు గాయనీగాయకులు షేక్ బి.సైదా (తెనాలి), పీఎల్ అలీఖాన్ (పొన్నూరు), షేక్ ఖాజా షానవాజ్ (హైదరాబాద్), శారదా రాజా (హైదరాబాద్), ఎం.మల్లిక (తెనాలి), కె.రాజేశ్వరరావు రాత్రి 9 గంటల వరకు ప్రేక్షకులను అలరించారు. ఇజ్జత్ సినిమాలో అతి క్లిష్టమైన పహాడ్ రాగంలో రఫీ గానం చేసిన 'ఏ దిల్ తుమ్ బిన్' గీతాన్ని డాక్టర్ పురుషోత్తమరావు చక్కగా గానం చేసి ప్రశంసలు అందుకున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాల ప్రదానం



తెనాలి: తెనాలిలోని ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం 210 మంది విద్యార్థులకు రూ.3 లక్షల ప్రతిభా నగదు పురస్కారాలను, నోటు పుస్తకాలను అందించారు. స్థానిక ముత్యంశెట్టిపాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఏర్పాటైన సభకు సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. ప్రముఖ రచయిత, పరిశోధకుడు ముత్తేవి రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదిగేందుకు పాఠశాలలు ప్రేరణ ఇస్తాయని చెప్పారు. విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదువుకుంటే విజయం లభిస్తుందని తెలిపారు. విశిష్ట అతిథులు గుంటూరు ఐటీఓ బిట్రా తిరుమల సత్యనారాయణ, ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగి వేదాంతం ఫణీంద్ర, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కాజూలూరి ఆదినారాయణ, శ్రీవీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఈఎల్‌వీ అప్పారావు, రాచాబత్తుని శ్రీనివాసరావు, జొన్నాదుల మహేష్, సొసైటీ కోశాధికారి దివి పురుషోత్తం మాట్లాడారు. సభకు ముందు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేత బృందాలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రదానం చేశారు. అంతకుముందు ప్రధాన కార్యదర్శి గంజి శివ భుజంగ ప్రభాకరరావు స్వాగతం పలికారు. కటకం శేషగిరి, పంచుమర్తి భాస్కరరావు, టీవీ కృష్ణారావు, హేమంత్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో రంగా విగ్రహ ఏర్పాటుకు కృషి



సమావేశంలో పాల్గొన్న కాపు జాగృతి నాయకులు, సభ్యులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలో ఉండవల్లి సెంటర్‌లో ప్రజా నాయకుడు వి.ఎం. రంగా విగ్రహ పునః నిర్మించడానికి కాపుజాగృతి సంఘం ఆధ్వర్యంలో ఉండవల్లి సెంటర్‌లోని సీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్న రాజేష్ మాట్లాడుతూ 2016లో రోడ్డు విస్తరణలో భాగంగా ఉండవల్లి సెంటర్‌లో తొలగించిన రంగా విగ్రహాన్ని తాత్కాలికంగా ఆవిష్కరించడం, అదే విధంగా ఉండవల్లి సెంటర్‌లో రానున్న కాలంలో ఏర్పడే నాలుగు రోడ్ల కూడలి మధ్య రింగును ఏర్పాటు చేసి ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రింగ్ మధ్యలో ప్రతిష్ఠించి ఆ సెంటర్‌కు రంగా సెంటర్ అని పేరుపెట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. నూతనంగా ఏర్పడనున్న కమిటీకి ఉండవల్లి సెంటర్ రాధారంగా మిత్రమండలి కమిటీ పేరును పెద్దలు సూచించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాపు జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్ధన్, రంగా ముఖ్య అనుచరుడు అల్లుడు సాంబశివరావు, ఉప్పు హరిబాబు, పోతురాజు, తోట సాంబశివరావు, తెలుగుదేశం నాయకులు దాసరి కృష్ణ, లింగంశెట్టి కిషోర్, గుంటూరు జిల్లా పార్లమెంట్ యువ విభాగం ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్, జనసేన గ్రామ అధ్యక్షులు రాజా రమేష్, ఐటీ వింగ్ రాష్ట్ర కమిటీ సభ్యులు చవ్వాకుల కోటేష్ బాబు, కాపు జాగృతి గ్రామ కమిటీ సభ్యులు దాసరి దుర్గ మల్లేశ్వరరావు, జొన్న సురేష్, గాజుల సురేష్, గుర్రాల శేషగిరిరావు, పండు, కాపు సంక్షేమ సేన గ్రామ నాయకులు గుర్రాల మణికంఠ, మలిశెట్టి మోహన్, మాడ శరత్, మణి పాల్గొన్నారు.

నాయకత్వ బాధ్యతలు అలవర్చుకోవాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న విద్యార్థి నాయకులు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లి గీతాంజలి స్కూల్‌లో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ డెప్యూటీ కలెక్టర్ కె.బాలకృష్ణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి బాధ్యతలు చేపట్టి వివిధ రంగాల్లో కృషి చేయడం ఎంతో అభినందనీయమని, భావి భారతాన్ని సమర్థంగా నిర్వహించడానికి ఇది మంచి అవకాశమని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రమాదేవి మాట్లాడుతూ పాఠశాలలో ప్రతి సంవత్సరం ఎన్నికలు నిర్వహిస్తామని, విద్యార్థి నేతలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ డెప్యూటీ కలెక్టర్ విద్యార్థులను బ్యాడ్జీలతో సత్కరించారు. అనంతరం విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎలక్షన్ కమిషనర్‌గా ఎస్.భార్గవి వ్యవహరించారు.

విద్య ద్వారానే విశ్వబ్రాహ్మణుల సంక్షేమం



విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోట్సులు పంపిణీ చేసిన సురేంద్రనాథ్, సంక్షేమ సంఘ ప్రతినిధులు

ప్రొఫెసర్ కందేపి సురేంద్రనాథ్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్య ద్వారానే విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యమని విశ్రాంత అధ్యాపకుడు ఆచార్య కందేపి సురేంద్రనాథ్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో విశ్వకర్మ పేద విద్యార్థి సంక్షేమ సంఘ 27వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. సురేంద్రనాథ్ మాట్లాడుతూ సృష్టికర్త విశ్వకర్మ వారసులుగా మానవ నాగరిక సమాజానికి కావాల్సిన అన్ని రకాల పనిముట్లను అందించిన విశ్వబ్రాహ్మణులు ఆధునిక సమాజంలో మనుగడ సాధించాలంటే పండిత గానాల రామమూర్తి స్ఫూర్తితో విద్యావంతులుగా ఎదగడం తప్పనిసరి అని అన్నారు. ఈసందర్భంగా నగరంలోని దయా హృదయ సేవా సమితి అధ్యక్షుడు అమృతలూరి వీరబ్రహ్మేంద్రరావు, స్వర్ణ శిల్పి శంభాన వీరభద్రాచారి, లఘు చిత్రాల నిర్మాత, దర్శకుడు గన్నే వాసుదేవరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు సీహెచ్ వెంకట వసంతరావును సన్మానించారు. అనంతరం పాఠశాల, కళాశాలస్థాయి విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలు అందజేశారు. సంక్షేమ సంఘ వ్యవస్థాపకుడు గోనుగుంట్ల శేషగిరిరావు మాట్లాడుతూ గత 27 ఏళ్లుగా దాతల సహకారంతో నగరంలోని పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. సంక్షేమ సంఘ అధ్యక్షుడు పటాన్ల శివ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దుగ్గిరాల సబ్ రిజిస్ట్రార్ అద్దంకి నవ కుమార్, సంఘ కార్యదర్శి కటేవరపు కృష్ణారావు, కోశాధికారి చిర్రావూరి సుధీర్ బాబు, ఇంజనీర్ కందేపి వెంకటరావు, కందుకూరి లక్ష్మీనారాయణ, అంగలకుదుటి సుశీల, ఇంజనీర్ కందేపి వెంకటరావు, మేడూరి శివరామకృష్ణ పాల్గొన్నారు.



